# అదంతే!

"ఒసేవ్ అప్పలమ్మా!" అరిచింది సుందరమ్మగారు.

"ఏటమ్మా!" గేటుతీస్తూ అరిచింది అప్పలమ్మ.

"అప్పుడే పోతున్నావుటే నీ దుంపతెగ. ఈ ఒక్క గిన్నె కూడా కడిగేసిపోవే అమ్మా!" బతిమాలుతున్నట్లుగా కసురుకుందో, కుసురుతున్నట్లుగా బతిమాలుతోందో తెలియడం లేదు.

"ఇందాకే సెప్పబోయినారటమ్మా! గేటు తీసినాకిప్పుడా సెప్పడం, నావల్ల కాదు మరి". వినయమో, విసుగో తెలియడం లేదు."

"ఈ ఒక్క గిన్నేనే, తోమి వెళ్ళవే బాబూ" కొంచెం తగ్గింది సుందరమ్మగారు.

అంతే! ఎక్కేసింది అప్పలమ్మ. "రేపు పొద్దున్న తోముతా నట్టే పెట్టండమ్మా"

"ఎంతసేపే! మాట్లాడినంతసేపు పట్టదు. ఇదొక్కటే తోమిఫో ముందు" సుందరమ్మగారి బడాయింపు.

"ఆతలింకా రెండిళ్ళున్నాయమ్మా! ఇప్పటికే మాసెడ్డ ఆలీశమై పోనాది. రేపు తోంతానని సెప్పానుగంద". అప్పలమ్మ బుకాయింపు.

గేటుబయట కాలుపెట్టింది అప్పలమ్మ. "నీకెంత పెట్టినా విశ్వాసం లేదు. నీ జన్మే అంత, వెధవ జన్మ! ముదనష్టపు జన్మ" విసుక్కుంది సుందరమ్మగారు. వెళ్ళిపోతున్న అప్పలమ్మ చూసి, "ఎంత జేసినా యింకా సెప్తూనే వుంటారు. మీకేం పోనాది?" గొణుక్కుంది అప్పలమ్మ, విసుక్కుంటున్న సుందరమ్మగారిని విని.



"మళ్ళీ రేపు నా యింట్లో కాలు పెట్టు చెప్తా" సుందరమ్మగారి స్వగతం.

" ఈ యింటో పని సెయ్యడం నా వల్ల కాదు బాబు..." అప్పలమ్మ ఆకాశ భాషితం.

"రేపటి నుంచి దీనిచేత పని చేయించుకుంటే పాము కరిచి చచ్చినంత ఒట్టే" సుందరమ్మగారే ప్రతిజ్ఞ.

"రేపట్నించిగాని ఈ యింటో పన్జేస్తే పుస్తి పుటుక్కుమన్నంతొట్టే - అప్పలమ్మ అన.

తెల్లారింది కోడికూతలు వినబళ్ళేదుగాని పాలవ్యాను వచ్చేసింది. పాల పొట్లాలకోసం పరిగెత్తుతున్న వాళ్ళతోనే, తెచ్చుకుంటున్న వాళ్ళతోను, కళ్ళాపి, ముగ్గులు లేకుండానే వీధులు కళకళలాడిపోతున్నాయి.

"అమ్మా! అంట్లు" అప్పలమ్మ కేక.

"ముందర వాకిలి ఊడు! వేస్తా" సుందరమ్మగారి కేక.

"కొంచెం కాఫీపొయ్యండమ్మా! తలనొప్పొస్తున్నాది," అప్పలమ్మ గారాలు కురుస్తోందో, గునుస్తోందో!

"ముందరా వాకిలూడ్చి, అంట్లు ఏడుస్తూ వుండు, యిస్తా" సుదరమ్మగారి గొంతులో ఏదో అవ్యక్తాదరణ.

ఎన్నిసార్లు పీకినా పెరట్లో చంద్రకాంత మొక్కలు దుబ్బుల్లా పెరిగిపోతూనే వున్నాయి. పోనీ దుంప పెల్లగించేద్దామంటే పూలుపూసే చెట్లు - పీకెయ్యడానికి సుందరమ్మగారికి మనసొప్పడంలేదు. మరెల్లా? అదంతే! సుందరమ్మగారికి పూలు కావాలి. ఆ మొక్కలికి క్షేత్రం కావాలి.